దిన పత్రిక
తొలి సమయం

ఆదివారం । 12 । జూలై । 2026

## రేపు 'సింగరేణి భరోసా' యాత్ర

### - పాల్గొనున్న మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు



**తొలిసమయం, కొత్తగూడెం, జూలై 11 :**
సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమం లక్ష్యంగా రేపు బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'సింగరేణి భరోసా' యాత్రను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యాత్రలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. సింగరేణి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, తాటిచెర్ల బొగ్గు గనుల కేటాయింపు ద్వారా ప్రభుత్వ రంగ సంస్థను బలోపేతం చేసే చర్యలు చేపట్టిందన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికి కేంద్రం నిరంతరం అండగా ఉంటోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'సింగరేణి భరోసా' యాత్రను విజయవంతం చేయాలని బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ వెంకన్న నాయక్, రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి భూక్య రవి నాయక్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎస్.కె రెహమతుల్లా, జిల్లా మీడియా కన్వీనర్ రామారావు,ఆత్మ నిర్భర్ భారత్ జిల్లా కన్వీనర్ గొడుగు శ్రీధర్ యాదవ్,లక్ష్మీదేవిపల్లి,చుంచుపల్లి మండల అధ్యక్షులు నవీన్,బలగం శ్రీధర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## విజయవంతమైన ఉచిత మెగా క్యాన్సర్ వైద్య శిబిరం







**తొలిసమయం, కొత్తగూడెం, జూలై 11 :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ, రాష్ట్ర, జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిమ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, ఆరేపల్లి (వరంగల్) వైద్య బృందం సహకారంతో నిర్వహిస్తున్న రెండు రోజుల ఉచిత మెగా క్యాన్సర్ వైద్య శిబిరానికి తొలి రోజు విశేష స్పందన లభించింది.కొత్తగూడెం పట్టణంలోని శ్రీ వివేకానంద విద్యాలయంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు దారా రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో శనివారం సుమారు 200 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో 15 రకాల వైద్య పరీక్షలు నిర్వహించగా, 30 మంది వైద్యులు, వైద్య సిబ్బంది సేవలందించారు.వైద్య పరీక్షల్లో ముగ్గురికి క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించి, తదుపరి చికిత్స కోసం అవసరమైన సూచనలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం కూడా శిబిరం కొనసాగుతుందని, జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ బాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, డీసీసీ అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న, పెండ్యాల విజయభాస్కర్, యెలుగూరి నగేష్ కుమార్, కూరా శ్రీధర్, కొదుమూరి కోటేశ్వరరావు, కొదుమూరి భానుప్రకాశ్, దారా ధీరజ్, వారణాసి సురేష్, నరసింహ, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కూడా పర్మనెంట్ రెసిడెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలి

### రాష్ట్ర మైనారిటీ నాయకులు నయీమ్ ఖురేషి



**తొలిసమయం, కొత్తగూడెం, జూలై 11 :**
తెలంగాణలో ఎస్ఐఅర్ ప్రత్యేక ఇంటెన్సివ్ రీవిజన్ జరుగుతున్న నేపథ్యంలో నిరు పేద, మధ్య తర్గతి వర్గాల్లో 2002 లిస్ట్ లో తమ, తమ బంధువుల పేర్లు లేనివాళ్లు ముఖ్యంగా ముస్లింలు, దళితులు ఇబ్బంది పడుతున్నారని రాష్ట్ర మైనారిటీ నాయకులు నయీమ్ ఖురేషి తెలిపారు. అయితే భారత ఎన్నికల సంఘం కోరిన 12 రకాల పత్రాల్లో పిఆర్సి ఒకటని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కూడా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఈ విషయంపై వినతి పత్రాన్ని సమర్పించారని నయీమ్ ఖురేషి వివరించారు. కర్ణాటక ప్రభుత్వం ఎస్ఐఆర్ ని దృష్టిలో పెట్టుకొని ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కుని కోల్పోకూడదని పర్మనెంట్ రెసిడెంట్ సర్టిఫికేట్ జారీ చేస్తున్నారని ఇదే తరహాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా పి ఆర్ సి జారీ చేయాలని నయీమ్ ఖురేషి తన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.